స్మార్ట్ సిటీ.. పేరుకేనా!

- నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారాలు
- పలుచోట్ల వాహన ప్రమాదాలకు అవకాశం
- చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్న అధికారులు

కాకినాడ లీగల్: స్మార్ట్ సిటీగా కాకినాడను ఎంతో అభివృద్ధి పథంలో నడిపించాల్సిన అధికారులు ఏ మాత్ర పట్టించుకోకపోవడంతో ఇంకా గ్రామీణ ఛాయలే కనిపిస్తున్నాయి. యథేచ్ఛగా ఆక్రమణలు, అడ్డదిడ్డంగా వాహనాల ప్రయాణాలు, ట్రాఫిక్ సమస్య ఎదురయ్యేలా ఎక్కడ పడితే అక్కడ తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు

నిబంధనలు పాటించాలి



రోడ్డుపై వ్యాపారం చేసేవారు నిబంధనలు పాటించాలి. రహదారుల మలుపుల్లో బళ్లపై వ్యాపారం చేయడం ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడమే. ఈ విషయంపై వ్యాపారం చేసేవారికి అనేక సార్లు అవగాహన సదస్సులు పెట్టి వివరిస్తున్నాం. నిబంధనలు పాటించకపోతే వారిపై చర్యలు తీసుకుంటాం.

– డి.రామారావు, సీఐ, ట్రాఫిక్-2,కాకినాడ



ఒంటిమామిడి జంక్షన్ మలుపులో మొక్కజొన్న పొత్తుల వ్యాపారం

కాకినాడ స్మార్ట్ సిటీ పేరును చెడగొడుతున్నాయి. ఇవన్నీ కళ్లెదురుగా కనిపిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. దాంతో వాహనచోదకులు, నగరవాసులు ఇబ్బందులకు గురవుతున్నారు. నగరంలోని పలు ప్రధాన మలుపుల్లో బళ్లపై వివిధ వ్యాపారాలను నిర్వహిస్తున్నారు. దీంతో ఆ ప్రాంతంలో వినియోగదారులు చేరడంతో ద్విచక్ర వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. కాకినాడ రామారావుపేట– కొండయ్యపాలెం వంతెన మలుపుల్లో బళ్లపై బొప్పాయి, అరటి పళ్ల వ్యాపారాలు చేస్తున్నారు. కాకినాడ గాంధీనగర్ రైతుబజార్ రోడ్డు మలుపులో బళ్ల వ్యాపారాలు యథేచ్ఛగా చేస్తున్నారు. అలాగే కాకినాడ ఒంటి మామిడి జంక్షన్ వద్ద టర్నింగ్ పాయింట్‌లో మొక్క జొన్న పొత్తుల వ్యాపారాలు, ఇంద్రపాలెం బ్రిడ్జి టర్నింగ్ పాయింట్‌లో పూల వ్యాపారం, కాకినాడ సీబీఎం స్కూల్ టర్నింగ్ పాయింట్‌లో, రామారావుపేట సుబ్బయ్యహోటల్ టర్నింగ్‌లో, బాలాచెరువు సెంటర్ టర్నింగ్‌లో, రెడ్ క్రాస్ వీధి టర్నింగ్‌లో అనేక ప్రాంతాల్లో బళ్లపై వ్యాపారాలను తొలగించి ప్రమాదాలను



గాంధీనగర్ రైతుబజార్ రోడ్డు మలుపులో సాగుతున్న వ్యాపారాలు

జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికుల కోరుతున్నారు.

చర్యలు తీసుకోవాలి

ప్రధాన రహదారుల మలుపుల్లో ఏర్పాటు చేసే వ్యాపారాలతో పాదచారులు, వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ రద్దీగా ఉండే సమయాల్లో మలుపుల్లో ఉండే వ్యాపారుల వద్ద బైక్‌లు ఆపి కొనుగోలు చేస్తుండడంతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్ నిలిచిపోతోంది. ఆ సమయంలో రోడ్డుపై వెళ్లే వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు తగు చర్యలు తీసుకోవాలి.



రామారావుపేట-కొండయ్యపాలెం బ్రిడ్జి మలుపులో బొప్పాయిలు విక్రయిస్తున్న వ్యాపారులు

వర్గీకరణపై పోటాపోటీగా వినతులు





ఎస్సీ, ఎస్టీ ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాకు వినతిపత్రం ఇస్తున్న రాజేష్, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు (కుడి నుంచి ఎడమకు)

- ఏకసభ్య కమిషన్ చైర్మన్‌కు ఎస్సీ సంఘాల వినతి

కాకినాడ సిటీ: ఎస్సీ రిజర్వేషన్లను 59 ఉపకులాల వారికి దామాషా ప్రకారం వర్గీకరించాలని కోరుతూ మాదిగ రిజర్వేషన్ పోరాట సాధన సమితి నాయకులు గురువారం కలెక్టరేట్‌లో ఏకసభ్య కమిషన్ చైర్మన్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు విలేకర్లతో మాట్లాడారు. ఎస్సీలలో ఉమ్మడి రిజర్వేషన్ విధానం కొనసాగింపు వల్ల మాదిగ, మాదిగ ఉపకులాలు తీవ్రంగా నష్టపోయని నాయకులు వివరించారు. ఎస్సీ కులాలలో వచ్చిన ఉద్యోగాల్లో 70 శాతం ఉద్యోగాలు మాలలకు, 22 శాతం మాదిగలకు, 8 శాతం ఉపకులాల వారికి వచ్చాయన్నారు. ఎస్సీ రిజర్వేషన్ ఫలాలను 59 షెడ్యూల్డు కులాలలో ఒక మాల కులం మాత్రమే అగ్రశేణి ఉద్యోగాల్లోనూ, డాక్టర్లు, ఇంజినీర్లు మొదలైన అన్ని రకాల ప్రభుత్వ ఉద్యోగాల్లోనూ, గ్రూప్ 1, 2 పోస్టులతో పాటు అన్ని రకాలైన విద్యా ఉద్యోగ రంగాల్లో 70 శాతం రిజర్వేషన్లు పొందుతున్నారని కమిషన్‌కు వివరించినట్లు తెలిపారు. బీసీ రిజర్వేషన్లు రాష్ట్రాన్ని ఒక యూనిట్‌గా చేసి వర్గీకరించి అమలు చేస్తున్నారని, అందువల్ల ఎస్సీ రిజర్వేషన్లు వర్గీకరణ కూడా రాష్ట్రాన్ని యూనిట్‌గా వర్గీకరించడం వల్ల ఎస్సీల్లో 59 కులాల వారికి జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు అందుతాయన్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు బుంగ సంజయ్ మాదిగ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెజ్జింగి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపకులాల అభివృద్ధికి సూచనలిచ్చాం

ఎస్సీ వర్గీకరణ వల్ల ఎస్సీ కులాలు ఇంకా వెనుకబడి ఉన్న ఉప కులాల అభివృద్ధికి సూచనలిస్తూ వినతి పత్రం సమర్పించినట్లు ఎస్సీ నాయకులు డోకుబుర్ర భద్రం, నందికి వీరబాబు, కొముకూరు నాగేశ్వరరావు గురువారం విలేకర్లకు తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాను కాకినాడ, తూర్పుగోదావరి, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలకు మూడు అసెంబ్లీ స్థానాలను కేటాయించి, ఈ ప్రాంత ఎస్సీలకు రాజకీయ భరోసా కల్పించినట్లుగా ఉంటుందని వివరించారు. ఆ విధంగానే ఒక నియోజకవర్గం మాలలకు, ఒక నియోజకవర్గం మాదిగలకు ఒక నియోజకవర్గం రెల్లి కులాలకు వచ్చేలా చూడాలని కోరామన్నారు. ఎస్సీ జనాభా ఎక్కువగా ఉన్న కోనసీమ జిల్లాకు పార్లమెంటు స్థానాన్ని మాలలకు కేటాయించాలని కోరినట్లు నాయకులు భద్రం వివరించారు.



కలెక్టరేట్ చుట్టూ ఉన్న పోలీసు బందోబస్తు

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 341 ప్రకారం ఎస్సీలను వర్గీకరించే అధికారం లేదని ఏకసభ్య కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రం అందజేసినట్లు జైభీమ్‌రావు భారత పార్టీ పీఏసీ చైర్మన్ ఏనుగుపల్లి కృష్ణ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మాలలు సుమారు 80 లక్షలు పైబడి ఉన్నందున అత్యధిక జనాభా కలిగిన మాలల వర్గీకరణను వ్యతిరేకిస్తున్న విధానాలను పరిగణలోకి తీసుకుని వర్గీకరణ చేయవద్దని కమిషన్‌ను ఆయన కోరారు.

కలెక్టరేట్ చుట్టూ భారీ బందోబస్తు

ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ జిల్లా పర్యటన సందర్భంగా గురువారం ఉదయం నుంచి కాకినాడ కలెక్టరేట్ చుట్టూ పోలీస్ పహారాతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. దీంతో కలెక్టరేట్ వైపు వెళ్లే అన్ని దారులు మూసి వేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. అలాగే అక్కడ భారీ ఎత్తున ట్రాఫిక్ జామ్ కావడంతో ఆసుపత్రి, ఇతర కార్యాలయాలకు వెళ్లేవారు, వాహన చోదకులు, బాటసారులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం

కరప: ఎస్సీ కులాల ఉప వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని, అటువంటి వర్గీకరణ చెల్లదని 1998లోనే జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని కరప మండల పీవీ రావు మాల మహానాడు సభ్యుడు సవిలే రాజేష్ అన్నారు. కాకినాడ కలెక్టరేట్‌లో గురువారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ ఏక సభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాను కల్సి ఎస్సీ కులాల ఉప వర్గీకరణ, క్రీమీలేయర్ విధానాన్ని వ్యతిరేకిస్తూ పీవీ రావు మాల మహానాడు తరపున 10 అంశాలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం ఎస్సీ కులాలకు సంబంధించిన అంశాలపై అధికారాన్ని 341 ఆర్టికల్ ప్రకారం రాష్ట్రపతికి, పార్లమెంట్‌కు ఇచ్చిందన్నారు. అయితే సుప్రీంకోర్టు ఇచ్చిన తాజా తీర్పు రాష్ట్రపతి, పార్లమెంట్‌కు కల్పించిన అధికారాలను అడ్డుకోవడమేనన్నారు. 2024 జనాభా లెక్కల ప్రకారమే ఎస్సీ కులాల అభివృద్ధిని అంచనా వేయాలన్నారు. అలా కాకుండా వర్గీకరణకు సిఫారసు చేస్తే గతంలో రామచంద్రరాజు కమిషన్ చేసిన తప్పిదమే ఇప్పుడు రాజీవ్ రంజన్ మిశ్రా ఏక సభ్య కమిషన్ చేసినట్లవుతుందన్నారు. 2024 నాటి ఎస్సీ కులాల జనాభా లెక్కించిన తర్వాతనే వర్గీకరణ అంశాన్ని పునరాలోచించాలని కమిషన్ చైర్మన్‌ను కోరామన్నారు. ఎస్సీ కులాలకు సామాజిక వెనుకబాటుతనం వల్ల రిజర్వేషన్లు కల్పించబడ్డాయని, ఆర్థిక వెనుకబాటు తనంవల్ల కాదన్నారు. 2004లో వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు ఐదుగురు సభ్యుల ధర్మాసనం తీర్పు చెపుతూ రాష్ట్రపతి ఎస్సీ జాబితా రెండో విభాగంలో ఎంట్రీ 41, మూడో విభాగంలోని ఎంట్రీ 25 ప్రకారం శాసనం చేసే హక్కు కానీ, సమర్థత కానీ రాష్ట్ర ప్రభుత్వానికి లేదని తేల్చి చెప్పిందన్నారు. మళ్లీ ఇదే సుప్రీంకోర్టు ఈ ఏడాది ఆగస్టు నెల ఒకటో తేదీన వర్గీకరణ అంశంలో రాష్ట్ర ప్రభుత్వాలకు జోక్యం కల్పించడం రాజ్యాంగ విరుద్ధం కాదా అని రాజేష్ ప్రశ్నించారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

- పార్లమెంట్‌లో వ్యాఖ్యలపై దళిత సంఘాల ఆందోళన

కాకినాడ సిటీ: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై పార్లమెంట్‌లో అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షాను బర్తరఫ్ చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి, దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పార్లమెంట్ సాక్షిగా అంబేడ్కర్‌పై అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ గురువారం కలెక్టరేట్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. అంబేడ్కర్ విగ్రహానికి న్యాయవాది జవహర్ అలీ, పలు సంఘాల నేతలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా దళిత, ప్రజాసంఘాల నాయకులు, కేవీపీఎస్ నాయకులు మాట్లాడుతూ అమిత్‌షా వ్యాఖ్యలు అత్యంత దారుణమైనవని, ఈ వ్యాఖ్యలు అంబేడ్కర్‌ను అభిమానించే భారతదేశంలో నూటికి 85 శాతంగా ఉన్న దళిత బహుజనులను కించపరచడమేనన్నారు. రాజ్యాంగబద్ధంగా ప్రమాణం చేసి ఎన్నికైన వ్యక్తి రాజ్యాంగ నిర్మాతని కించపరచడం దుర్మార్గమన్నారు. సమాజంలో అంటరానితనం, కులవివక్ష పోవాలని, సామాజిక అసమానతలపై అలుపెరగని పోరాటం చేసిన గొప్ప ఉత్తమ దేశభక్తుడు, మహోన్నతమైన వ్యక్తి అంబేడ్కర్ అని కొనియాడారు. మనువాదులు, సంఘ పరివార్ శక్తులు తమ మనసులోని అంబేడ్కర్‌పై ద్వేషాన్ని, విషభావజాలాన్ని బయటపెట్టారన్నారు. అందులో భాగంగానే అధికారంలో ఉంటూనే రాజ్యాంగాన్ని, పార్లమెంటుని, చట్టాలను కించపరుస్తున్నారన్నారు. సామాజిక న్యాయాన్ని, సమానత్వాన్ని దెబ్బతీస్తూ మను ధర్మాన్ని ముందుకు తెస్తూ ప్రజల భవిష్యత్తుని నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో దళిత నాయకులు అయితాబత్తుల రామేశ్వరరావు, సామాజిక న్యాయ సాధన సమితి అధ్యక్షులు డాక్టర్ భానుమతి, కేవీపీఎస్ జిల్లా నాయకులు మోర్త రాజశేఖర్, యునైటెడ్ ఎస్సీ, ఎస్టీ ఫోరమ్ నాయకులు తమ్మల నూకరాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దళిత ప్రజా సంఘాల నాయకులు కేఎస్ శ్రీనివాస్, కింగ్, పిల్లి రామారావు, పెనుమాల సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కేవీపీఎస్, దళిత సంఘాల నాయకులు

ప్రజాప్రతినిధులకు నేడు శిక్షణ

కరప: స్థానిక మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులకు ఒకరోజు శిక్షణ ఏర్పాటు చేసినట్టు ఎంపీడీఓ ఎం.అనుపమ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు శిక్షణ ఉంటుందని గురువారం ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌జీఎస్ఏ కార్యాచరణ ప్రణాళిక 2025–26, జీపీడీపీ పైన, బీపీడీపీ పైన, డీడీపీ పైన ఈఓపీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు నేతృత్వంలో శిక్షణ ఇస్తారన్నారు. మండల పరిధిలోని జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు ఆధార్‌కార్డుతో తప్పని సరిగా హాజరుకావాలని ఎంపీడీఓ అనుపమ కోరారు.

గుర్రపు డెక్క తొలగింపు

కరప: మండల పరిధిలోని సంపరబోది పంట కాలువలో గుర్రపుడెక్క తొలగింపు పనులను గురువారం కరప డీసీ చైర్మన్ పీజీ సత్యనారాయణ ప్రారంభించారు. సంపర బోదిలో గుర్రపుడెక్క అడవిలా పెరిగిపోయింది. దీంతో కాలువ శివారున ఉండే వాకాడ, వేములవాడ, వలసపాకల, కరప గ్రామాలకు సాగునీరందని పరిస్థితి ఏర్పడింది. నీటిసంఘం ఎన్నికలలో భాగంగా వేములవాడ నీటి సంఘం అధ్యక్షుడు పీజీ గ్రామాల్లో తిరిగినప్పుడు సంపరబోది పంట కాలువ పరిస్థితిని రైతులు వివరించారు. తర్వాత కరప డీసీ చైర్మన్‌గా ఎన్నికైన గుర్రపుడెక్క పనులను చేపట్టినట్టు ఆయన తెలిపారు. మీసాల రాంబాబు, వాసంశెట్టి రా మాంజనేయులు, చాట్ల ఇమ్మాన్యుయేలు పాల్గొన్నారు.



గుర్రపు డెక్కను తొలగిస్తున్న సిబ్బంది

మత్తు పదార్థాలు వద్దు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న విద్యార్థులు

బాలాజీచెరువు: మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని ఆదిత్య డిగ్రీ కళాశాల ఏడీ డాక్టర్ బీఈవీఎల్ నాయుడు పేర్కొన్నారు. డ్రగ్‌ఫ్రీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వ్యాస రచన, పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలు నిర్వహించారు. సే నో టూ డ్రగ్స్ అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో కె.చంద్రిక ప్రథమ బహుమతి, జే.మహేశ్వరి ద్వితీయ, ఎ.జాస్మిన్ తృతీయ బహుమతి సాధించారు. పోస్టర్ ప్రజంటేషన్ పోటీల్లో ఆశలక్ష్మి ప్రథమ బహుమతి, ఎ.కమలాదేవి ద్వితీయ బహుమతి, ఎస్.లతీఫ్ తృతీయ బహుమతి సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల చైర్మన్ శేషారెడ్డి, కార్యదర్శి సుగుణారెడ్డి, ఎన్ఎస్ఎస్ పీఓ తేజేశ్వరరావు అభినందించారు.

క్లుప్తంగా

ధనుర్మాసంలో ప్రత్యేక బస్సులు

కాకినాడ: ధనుర్మాసం సందర్భంగా కాకినాడ ప్రాంత భక్తుల సౌకర్యార్థం నవజనార్ధన పారిజాతాలు, సప్త శ్రీనివాసాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు జిల్లా ప్రజా రవాణాధికారి ఎం.శ్రీనివాసరావు వెల్లడించారు. ఇందుకు సంబంధించిన ప్రచార పోస్టర్‌ను ఆయన గురువారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ధవళేశ్వరం, మడికి, జొన్నాడ, ఆలమూరు, మండపేట, కపిలేశ్వరపురం, మాచర, కోరుమిల్లి, కోటిపల్లి క్షేత్రాలకు సంబంధించి నవపారిజాతాలకు ఉదయం 6 గంటలకు బయలుదేరి రాత్రి 8 గంటలకు చేరుకుంటాయన్నారు. ఈ బస్సు టిక్కెట్ పెద్దలకు రూ.320, చిన్నపిల్లలకు రూ.250 నిర్ణయించామన్నారు. అలాగే సప్త శ్రీనివాసాలుగా యానాం, అప్పనపల్లి, అబ్బిరాజుపాలెం, కొడమంచిలి, అన్నవరప్పాడు, వాడపల్లి, మండపేట ప్రాంతాలకు బస్సులు నడుపుతామన్నారు. ఈ బస్సు తెల్లవారు జామున 4 గంటలకు ఇక్కడి నుంచి బయలుదేరి రాత్రి 9 గంటలకు తిరిగి చేరుతుందన్నారు. పెద్దలకు రూ.475, పిల్లలకు రూ.370గా నిర్ణయించామన్నారు. ఇవి కాకుండా ఏ ఇతర క్షేత్రాలు అయినా స్పెషల్ బస్సులు కావాలంటే నడుపుతామని, రిజర్వేషన్ కోసం కాకినాడ డిపో మొబైల్ నెంబర్లు 99592 25543, 99582 25564, 73829 10658, 73829 10596 నెంబర్లను సంప్రదించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ డిపో అసిస్టెంట్ మేనేజర్లు పి.బాలకృష్ణ, ఎస్‌కేఎం బాషా, పీఆర్వో సీహెచ్ వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

బాలాజీచెరువు: ఆలిండియా క్రిస్టియన్ కౌన్సెల్ (ఏఐసీసీ) ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఏఐసీసీ అధ్యక్షులు రిక్కీ గూటం పేర్కొన్నారు. ఏఐసీసీ, మహాత్మాగాంధీ క్యాన్సర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో గురువారం అప్పలరాజు పేటలో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సాధారణ వైద్య పరీక్షలతో పాటు దంత, కంటి సమస్యలతో పాటు, మహిళలకు ప్రత్యేక వైద్య సేవలు అందించి సోము దుర్గా ప్రసాద్, కొమ్మిశెట్టి శ్రీహర్ష అందించిన మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్యాంపు కో–ఆర్డినేటర్ స్వాతిశ్రీ, చార్లెస్ సంతోష్, సల్మాన్, ఝాన్సీ పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ



పంచాయతీ పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు అందజేస్తున్న స్థానిక నాయకులు

కరప: స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం అడబాల రత్నప్రసాద్ చారిటబుల్ ట్రస్ట్ సమకూర్చిన దుప్పట్లను వైఎస్సార్ సీపీ నాయకుడు సాదే లోహిదాస్ అందజేశారు. యేట శీతాకాలంలో ట్రస్ట్ ద్వారా కరప పంచాయతీ పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు అందజేస్తుంటామని మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు తెలిపారు. వాకర్స్ అసోసియేషన్ సభ్యులు నక్కా సాంబయ్య, యాళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గోపాలకృష్ణ సేవలు చిరస్మరణీయం

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): తూర్పుగోదావరి జిల్లాలో క్రికెట్ అభివృద్ధికి ఎనలేని సేవలు చేసిన జిల్లా క్రికెట్ సంఘ లైఫ్ మెంబరు, మాజీ జాయింట్ సెక్రటరీ గోపాలకృష్ణ సేవలు చిరస్మరణీయం అని జిల్లా క్రికెట్ సంఘ మాజీ అధ్యక్షుడు తలాటం హరీష్ పేర్కొన్నారు. గురువారం కాకినాడలో క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గోపాలకృష్ణ సంతాప సభ కార్యక్రమం నిర్వహించారు. మాజీ కార్యదర్శి బాపిరాజు, హరీష్, అసోసియేషన్ సభ్యులు గోపాలకృష్ణ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. ఆంధ్రాక్రికెట్ సంఘ కార్యదర్శి సానా సతీష్‌బాబు జిల్లా కార్యదర్శిగా పనిచేసిన సమయంలో గోపాలకృష్ణ అందించిన సేవలను సభ్యులు గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మోపూరి వెంకటేశ్వరరావు, కొప్పన ప్రసాద్, డివిఎస్ రాజు, సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలి

కరప: భూ సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ అన్నారు. మండలం పెద్దాపురప్పాడులో గురువారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. రైతులు తమ భూములకు సంబంధించి ఏ సమస్య ఉన్నా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పెద్దాపురప్పాడు, విజయరాయుడుపాలెం సర్పంచ్‌లు బిరుదా సరస్వతి, శ్రీనివాస అప్పారావు, వెలుగుబంటి సీతారామ రాఘవ, ఎంపీటీసీ పి.పద్మావతి, డీటీ డి.దుర్గాప్రసాద్, వీఆర్వో పాల్గొన్నారు.

ధ్యానం దివ్యౌషధం



యోగ సాధనలో విద్యార్థులు

బాలాజీచెరువు: ధ్యానం ఒక దివ్య ఔషధం లాంటిదని ఆంధ్రప్రదేశ్ యోగా విద్యాపీఠం రాష్ట్ర అధ్యక్షుడు చిట్టూరి చిట్టిబాబు పేర్కొన్నారు. స్థానిక జగన్నాథపురం ఎస్సీ బాలికల సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో ఉచిత ధ్యాన శిక్షణ తరగతులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ డిసెంబర్ 21న ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా తరగతులు నిర్వహిస్తున్నామని, అద్భుతమైన ప్రాచీన భారతీయ కళ ధ్యానమన్నారు. ధ్యానం కేవలం హిమాలయాల్లో తపస్సు చేసే స్వామిజీలకే పరిమితమైనది కాదని, ఆధునిక పోటీ ప్రపంచంలో తీవ్ర ఒత్తిడి, ఆందోళనతో కొట్టుమిట్టాడుతున్న ప్రతి వ్యక్తికి, ముఖ్యంగా విద్యార్థి, యువతకు ధ్యానం ముఖ్యమన్నారు. ప్రతిరోజూ దినచర్యలో భాగంగా 30 నిమిషాల పాటు ధ్యాన సాధన ద్వారా ఆధునిక రోగాలన్నింటినీ తగ్గించవచ్చన్నారు. డిసెంబర్ 21న ఆదిత్య శ్రీనగర్ అకాడమిలో విద్యార్థులతో నిర్వహించే ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వసతిగృహ సంక్షేమ అధికారి పద్మావతి, విద్యార్థులు పాల్గొన్నారు.

నెలాఖరు లోపు ఆస్తి పన్ను చెల్లిస్తే వడ్డీ మినహాయింపు

కాకినాడ: నగరపాలక సంస్థ పరిధిలో 2024–25 రెండో అర్థ సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్నును ఈ నెల 31వ తేదీ లోపుగా వడ్డీ లేకుండా చెల్లించవచ్చునని నగరపాలక సంస్థ కమిషనర్ భావన తెలిపారు. 2025 డిసెంబర్ 1వ తేదీ నుంచి ఆస్తిపన్ను బకాయిలపై 2 శాతం వడ్డీ చెల్లించాల్సి వస్తోందన్నారు. పన్ను బకాయిలకు సంబంధించి ఇళ్లు, వాణిజ్య సముదాయాలను జప్తు చేసే అవకాశం ఉన్నందున తక్షణమే పన్నులు చెల్లించాలని ఆమె పన్ను బకాయిదారులకు సూచించారు. ఈ మేరకు తుది నోటీసులు కూడా జారీ చేశామని, పన్నులు చెల్లించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. పన్ను బకాయిదారులు తమ ఆస్తిపన్ను, కుళాయి పన్ను, ఖాళీస్థలాల పన్నులు ఈ నెల 31వ తేదీలోగా చెల్లించి సహకరించాలని కమిషనర్ కోరారు.

బార్జిలోని బియ్యం పౌరసరఫరాల గోదాములకు తరలింపు



ఓడలో గుర్తించిన పీడీఎస్ బియ్యాన్ని పౌరసరఫరాలశాఖ గోదాముల్లో భద్రపరుస్తున్న అధికారులు

కాకినాడ సిటీ: కాకినాడ యాంకరేజ్ పోర్టులోని బార్జిలో ఉన్న వెయ్యి మెట్రిక్ టన్నుల పీడీఎస్ బియ్యాన్ని బార్జీ నుంచి అన్‌లోడ్ చేసి గురువారం పౌరసరఫరాల శాఖ గోదాముల్లో భద్రపరిచినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బియ్యాన్ని అన్‌లోడ్ చేసే ప్రక్రియను పోర్టు అధికారులు, సివిల్ సప్లై అధికారులు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు.

చిన్న పిల్లలతో భిక్షాటన చేయిస్తే కఠిన చర్యలు

కాకినాడ క్రైం: చిన్న పిల్లలతో యాచన చేయించే వారిపై కఠిన చర్యలకు సిఫార్సు చేస్తామని జిల్లా బాలల విభాగం సంరక్షణ అధికారి కె.విజయ తెలిపారు. వీరిలో పిల్లల తల్లిదండ్రులు ఉన్నా సహించేది లేదని స్పష్టం చేశారు. కాకినాడ జీఆర్‌పీ పోలీసులు, జిల్లా బాలల విభాగం సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని టౌన్ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు అవగాహన కల్పించారు. బాలలతో భిక్షాటన చేయించడం చట్టరీత్యా నేరమని అన్నారు. కార్యక్రమంలో జీఆర్‌పీ ఎస్ఐ రవికుమార్ మాట్లాడుతూ, పిల్లలతో భిక్షాటన చేయిస్తున్న వారి సమాచారం తమకు ఇవ్వాలని కోరారు. వీధిబాలలు, బాల కార్మికులను గుర్తిస్తే వారి భవిత ఓ సామాజిక బాధ్యతగా గ్రహించి స్థానిక పోలీస్‌స్టేషన్ లేదా బాలల సంరక్షణ విభాగానికి సమాచారం అందించి వారి భవిష్యత్‌ను సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ ప్రొటెక్షన్ బృందం చినబాబు, దుర్గారాణి, దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.



ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులు, జీఆర్‌పీ పోలీసులు

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి

కాకినాడ రూరల్: కాకినాడ రూరల్ మండలం పండూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకవ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. తిమ్మాపురం ఎస్సై ఎంవీవీ రవీంద్రబాబు తెలిపిన వివరాల మేరకు పండూరు గ్రామానికి చెందిన ముద్దా సత్యనారాయణ (58) భవన నిర్మాణ కార్మికుడు. ఆయన గురువారం ఉదయం పనికి వెళ్లి మధ్యాహ్నం గోర్స వైపు నుంచి సైకిల్‌పై ఇంటికి వస్తుండగా పండూరు పాలకేంద్రం వద్ద ఎదురుగా వేగంగా వచ్చిన ట్రాక్టర్ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అతను రోడ్డుపై పడి తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాద వార్త తెలిసిన వెంటనే అతని కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని, చికిత్స కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధృవీకరించారు. మృతుని కుమారుడు శివ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై రవీంద్రబాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

సోదరుని చూడడానికని చెప్పి ఆస్పత్రికి వెళ్లి తిరిగి రాకపోవడంతో తిమ్మాపురం పోలీసులు యువతి అదృశ్యంపై కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన కథనం మేరకు.. కాకినాడ రూరల్ మండలం సూర్యారావుపేట గ్రామానికి చెందిన వ్యక్తి చేపల వేటతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అతని కుమార్తె గురువారం మధ్యాహ్నం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సోదరుని చూసి వస్తానని చెప్పి బయటకు వెళ్లింది. సాయంత్రం వరకు రాకపోయే సరికి కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాల్లో, బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో గాలించినా ఆచూకీ తెలియలేదు. తల్లి ఫిర్యాదు మేరకు ఏఎస్సై ఆర్‌వీఎస్ మూర్తి అదృశ్యం కేసుగా నమోదు చేశారు. ఆమె ఐదడుగుల అడుగులు ఎత్తు ఉంటుందని, పసుపురంగు టాప్, ఎరుపురంగు లెగ్గిన్ ధరించి ఉంటుందని, ఆచూకీ తెలిసిన వారు తిమ్మాపురం పోలీసుస్టేషన్‌కు తెలియజేయాలని పోలీసులు కోరారు.

నెలాఖరుకు అందుబాటులోకి బీచ్ పార్కు

కాకినాడ రూరల్: ఈ నెలాఖరు నాటికి కాకినాడ బీచ్ పార్కు నిర్మాణ పనులు పూర్తిచేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకు వస్తామని కౌడా చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) తెలిపారు. కాకినాడలో గురువారం జరిగిన కౌడా సమావేశంలో వివిధ అభివృద్ధి పనులపై సమీక్షించి ఆయన మాట్లాడారు. ప్రజలకు, పిల్లలకు ఆహ్లాదం కలిగించేలా నిర్మాణపనులు చేపట్టేందుకు అనుమతులు ఇవ్వడం జరిగిందన్నారు.

కాకినాడలోని జంతు హింసా నివారణ సంఘంలో మౌలిక సదుపాయాల కల్పనకు అనుమతులు ఇచ్చామన్నారు. టీయు142ఎం యుద్ధ విమాన ప్రదర్శనకు ఎంట్రీ టికెట్ ధర నిర్ణయించినట్లు ఆయన తెలిపారు.